క్లుప్తంగా

శ్రీహాయిగ్రీవ జయంతి వేడుకలు రేపు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట వారిజా ఆశ్రమంలో శ్రీ లక్ష్మీ హాయిగ్రీవ మందిరంలో బుధవారం శ్రావణ పూర్ణిమ, శ్రీ లక్ష్మీ హాయిగ్రీవ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా లోక కల్యాణార్థం ఉదయం 7.30 గంటల నుంచి తిరుమంజనం (అభిషేకం), హోమం, కవచ అలంకరణ నిర్వహించనున్నట్లు తెలిపారు.

వినాయక చవితికి ఉత్సవరాట



ఉత్సవరాట వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సత్యనారాయణపేటలో సోమవారం వినాయక చవితి ఉత్సవరాట చేశారు. ఈ ముహూర్తపు పూజలో వార్డు ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్, సరగడ నాగిరెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, మాజీ కౌన్సిలర్ అనకాపల్లి వెంకటరావు, షేక్ అబ్దుల్ గఫూర్, మాదాబత్తుల త్రినాథ్, గుజ్జు రాము, బొజ్జా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇదే గ్రామంలో మరోచోట నిర్వహించిన ఉత్సవరాట కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్లా వంశీరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, చేట్ల నరసింగరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాశీ విశ్వేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు కొమ్మాది జంక్షన్ సమీపంలోని వికలాంగుల కాలనీలో సోమవారం శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి సహిత గణపతి, పార్వతీ దేవి, నాగబంధం, సుబ్రమణ్య స్వామి, నందీశ్వరుడు, అయ్యప్ప స్వామి, షిర్డీ సాయిబాబా, నవగ్రహ విగ్రహాలు, ధ్వజ స్తంభం సోమవారం భక్తి శ్రద్ధలతో ప్రతిష్టించారు. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో 7వ వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టీడీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆపస్ నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన ఆపస్ కార్యవర్గ సభ్యులు

పద్మనాభం: పద్మనాభం మండల శాఖ ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ (ఆపస్) సంఘం అధ్యక్షునిగా కంటుబోతు మురళి సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షునిగా ఎన్.జగదీష్, ప్రధాన కార్యదర్శిగా మైపూడి శంకర నారాయణ, కోశాధికారిగా కనకల సన్యాసినాయుడు, మహిళా కన్వీనర్‌గా బత్తుల రాజ్యలక్ష్మి, అసోసియేట్ అధ్యక్షులుగా బంగారు అప్పలరాజు, వి.సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరికి నియామకపత్రాన్ని ఆపస్ జిల్లా అధ్యక్షుడు అవనాపు అరుణ్ కుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు కాళ్ల గోపీనాథ్ అందజేశారు. పద్మనాభం జిల్లా పరిషత్ బంగ్లా ప్రాంగణంలో ఈ ఎన్నికలు నిర్వహించారు.

విద్యుత్ సరఫరాకు పలుమార్లు అంతరాయం

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం జంపర్లు కట్ అయినందున పలుమార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలోని పట్టణ, రూరల్ వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పగలంతా విద్యుత్ సరఫరాలో అంతరాయానికి తోడుగా ఉక్కపోత కారణంగా అసహనానికి గురయ్యారు. సాయంత్రానికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టిన అధికారులు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

భూ హక్కు పత్రాలు ఇప్పించండి



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ రాము



భీమిలి తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

- భీమిలి తహసీల్దార్‌కు సంతపేట వాసులు, వైఎస్సార్ సీపీ నాయకుల వినతి

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంతపేట సర్వే నంబర్ 38/1 రాళ్లగుట్ట, 38/2 గ్రామకంఠంలో 40 ఏళ్లకు పైగా నివసిస్తున్న సుమారు 700 కుటుంబాలకు శాశ్వత భూహక్కు పత్రాలు ఇప్పించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు భీమిలి తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి మాట్లాడుతూ 4 వేల మంది నివసిస్తున్న ఈ ప్రాంతంలో ఇంటి పన్నులు చెల్లిస్తున్నా శాశ్వత భూహక్కు పత్రాలు లేనందున అవసరాలకు బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదన్నారు. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ చట్టం – 2019ను అనుసరించి జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో సవరణలు చేసి ఇక్కడి ప్రజలకు శాశ్వత భూహక్కు పట్టాలు జారీ చేసి న్యాయం చేయాలని కోరారు. ఆయనవెంట వార్డు ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్, నీలాపు సురేష్‌రెడ్డి, సరగడ నాగిరెడ్డి, తెడ్లాపు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద జెడ్సీ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందనకు పది వినతులు వచ్చాయి. ఇంజినీరింగ్ విభాగానికి ఆరు, పట్టణ ప్రణాళిక విభాగానికి రెండు, యూడీసీ విభాగానికి, ప్రజారోగ్య విభాగానికి ఒక్కొక్క వినతి వచ్చాయి. సమస్యలు పరిష్కరిస్తానని జెడ్సీ తెలిపారు.

జోన్ – 2 స్పందనకు 8 అర్జీలు

మధురవాడ: జగనన్నకు చెబుదాం (స్పందన)లో వచ్చిన అర్జీల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామని జీవీఎంసీ జోన్ – 2 కమిషనర్ కె.కనక మహాలక్ష్మి అన్నారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పలు వార్డులకు చెందిన వివిధ ప్రాంతాల నుంచి 8 ఫిర్యాదులు అందాయి. రెవెన్యూ కాలనీలో వీధి లైట్లు వెలగడం లేదని, పారిశుధ్యం అధ్వానంగా ఉందని, కుక్కలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రిటైర్డ్ తహసీల్దార్ గోవిందరావు, టీచర్స్ లే అవుట్ వెనుక, పీఎం పాలెం ది షుగర్ ఫ్యాక్టరీ లే అవుట్‌లో వీధిలైట్లు వెలగక ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఫిర్యాదు చేశారు. సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపడతామని జెడ్సీ హామీ ఇచ్చారు. .

ఓపెన్ స్కూల్ విద్యార్థులకు సర్టిఫికెట్లు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న నాగరాజు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ యాజమాన్యం సాయంతో ఓపెన్ స్కూల్ విధానంలో విద్యాభ్యాసం పూర్తి చేసిన 20 మంది విద్యార్థులకు సోమవారం సంస్థ సీఎస్ఆర్ ప్రతినిధి ఇ.ఎస్.నాగరాజు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. వీరిలో 12 మంది పదో తరగతి, 8 మంది ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా సంస్థ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాట్లాడారు. వివిధ కారణాలతో మధ్యలో చదువు మానేసిన తాము దివీస్ ఆర్థిక సహకారం, ప్రోత్సాహంతో విద్యాభ్యాసం పూర్తి చేయగలిగామన్నారు. నాగరాజు మాట్లాడుతూ 15 ఏళ్లుగా బడి బయట ఉన్న పిల్లల్ని గుర్తించి ఓపెన్ స్కూల్ ద్వారా చదివించి ఉపాధి అవకాశాలు పొందేలా తోడ్పడుతున్నామన్నారు. కార్యక్రమంలో కె.నరసింహారావు, పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

170 మందికి నేత్ర వైద్య పరీక్షలు



కంటి పరీక్షలకు హాజరైన విద్యార్థులు

ఆనందపురం : మండలంలోని శిర్లపాలెం ఉన్నత పాఠశాలలో విశాఖ జోన్ శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. మోషన్ స్కూల్ హెల్త్ ఐ కేర్ ప్రాజెక్టు తరపున విశాఖ ఐ ఆస్పత్రి ట్రస్ట్ సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో 170 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో నలుగురికి కళ్లద్దాలు అవసరమని గుర్తించి ఉచితంగా అందజేయడానికి నిర్ణయించారు. కార్యక్రమంలో సర్పంచ్ శిర్ల జానకి, హెచ్ఎం పద్మావతి, సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు తమ్ము నాయుడు, ఏబీఎస్ మూర్తి, డి.సంతోష్ కిరణ్, ఎ.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అమరవీరులకు ఘన నివాళి



విద్యుత్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

మధురవాడ: విద్యుత్ అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని మధురవాడ జోనల్ కార్యాలయం సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. 2000 సంవత్సరంలో ప్రజలు చేపట్టిన విద్యుత్ పోరాటంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం బషీర్‌బాగ్‌లో జరిపిన తుపాకీ కాల్పుల్లో మృతి చెందిన అమరవీరులు రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్‌రెడ్డి చిత్రపటాలకు సీపీఎం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాటి పోరాట స్ఫూర్తిని, అప్పటి ప్రభుత్వం జరిపిన పాశవిక దాడిని వివరించారు. సీపీఎం మధురవాడ జోన్ కార్యదర్శి డి.అప్పలరాజు మాట్లాడుతూ నాటి పోరాట స్ఫూర్తితోనే పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మధురవాడ జోన్ ప్రధాన కార్యదర్శి పి.రాజ్ కుమార్, ఎం.రాము, కె.శంకర్రావు, బి.నర్సింగరావు, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి పోస్టర్ ఆవిష్కరణ



శ్రీకృష్ణ జన్మాష్టమి పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామంలో సెప్టెంబర్ 6 నుంచి 16 వరకు నిర్వహించనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల పోస్టర్‌ను ఎంపీపీ కంటుబోతు రాంబాబు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి, హిందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథ, సభ్యులు జి.కృష్ణ సూరప్పడు, బి.పైడన్న, ఎస్.శ్రీనివాస్, వి.సురేష్, ఎస్.సూర్యనారాయణ పాల్గొన్నారు.

కార్మికులకు రూ.30 కోట్లకుపైగా చెల్లింపులు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు గుర్తింపు సంఘం ఇంటక్ అధ్యక్షుడు కాకర్లపూడి వరహాలరాజును ఆ సంఘ నాయకులు సోమవారం ఆనందపురం మండలం రామవరంలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జీరు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి చిల్ల వెంకటరమణ, సరగడ సూరిబాబు తదితరులు మాట్లాడుతూ 2009లో మిల్లు లాకౌట్ తర్వాత ఏ ప్రభుత్వమూ ఇక్కడి కార్మికులకు న్యాయం చేయలేదన్నారు. 2019లో అధికారం చేపట్టిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమే కార్మికుల కష్టాలను పట్టించుకుందన్నారు.

6 వేల మంది కార్మికుల కుటుంబాల పట్ల భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవ, ఇంటక్ అధ్యక్షుడు కాకర్లపూడి వరహాలరాజు నిబద్ధత కారణంగా రూ.30 కోట్లకు పైగా చెల్లింపులు జరిగాయన్నారు. ఈ సందర్భంగా వరహాలరాజును ఘనంగా సన్మానించారు.

స్వయం ఉపాధితో కుటుంబాలకు ఆసరా



సర్టిఫికెట్లు అందజేస్తున్న మేయర్ గొలగాని హరి వెంకట కుమారి

కొమ్మాది: స్వయం ఉపాధితో కుటుంబాలకు మహిళలు ఆసరాగా నిలుస్తున్నారని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో గల శ్రీ సత్యసాయి శాశ్వత ఉపాధి శిక్షణ కేంద్రంలో జ్యూట్ బ్యాగ్ తయారీలో శిక్షణ ముగింపు కార్యక్రమంలో సర్టిఫికెట్లు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీ సత్యసాయి సేవా సంస్థ ద్వారా అనేక మంది మహిళలకు స్వయం ఉపాధితోపాటు ఆర్థిక స్వావలంబన చేకూరుతుందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ మహిళలకు అనేక రంగాల్లో ఉచిత శిక్షణ అందజేస్తున్నామని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు తెలిపారు. జ్యూట్ బ్యాగ్ తయారీ, కుట్లు, అల్లికలు, పురుషులకు కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. అనంతరం కేంద్రం ప్రాంగణంలో ఆయన మొక్కలు నాటారు.

వీధి దీపాల ఏర్పాటుకు వినతి

పద్మనాభం: పద్మనాభం పంచాయతీ పద్మనాభం, ఇసకలపాలెం, అర్చకునిపాలెం గ్రామాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని హంస మహేష్, కాళ్ల శ్రీనివాసరావు పద్మనాభం పంచాయతీ కార్యదర్శి అరసాడ రఘుపతిరావుకు సోమవారం సచివాలయంలో వినతిపత్రం ఇచ్చారు. పద్మనాభం జంక్షన్ నుంచి కుంతీ మాధవ స్వామి ఆలయం వరకు, బ్రాహ్మణ వీధి, బీసీ కాలనీలో వీధిదీపాలు వెలగక పాదచారులు, ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహన చోదకులు చీకట్లో ప్రయాణించాల్సి వస్తోందని ఆ వినతిపత్రంలో తెలిపారు. క్వారీ లారీలు, పెద్ద వాహనాలు తిరగడం వల్ల పద్మనాభం ప్రధాన రహదారి గోతులు పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వీధి దీపాలు ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



కనకరత్నంకు రూ.10వేలు అందిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు రామునాయుడు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు చిట్టివలసకు చెందిన డింగి కనకరత్నంకు వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు సోమవారం రూ.10 వేలు అందించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో కనకరత్నం భర్త పైడిరాజు మృతి చెందడంతో బీమా పరిహారంలో భాగంగా తక్షణ సాయాన్ని అందించారు. కార్యక్రమంలో పట్టణ మహిళ అధ్యక్షురాలు జీరు సుజాత, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎర్రా ప్రకాష్, దల్లి కొత్తయ్యరెడ్డి, ముడిదాన అప్పారావు, బొగ్గురోడ్డు – 1 వార్డు సచివాలయం అడ్మిన్ కిషోర్, వెల్ఫేర్ సెక్రటరీ కల్యాణ్, వీఆర్వో రాము తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

తగరపువలస: చిట్టివలస గణేష్ థియేటర్ వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన గొడవకు సంబంధించి బాకి వెంకటరావు, చిల్ల సతీష్‌పై భీమిలి పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. థియేటర్ క్యాంటీన్‌కు చెందిన పారుపల్లి చరణ్, తుపాకుల శ్రీనుతో మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో జరిగిన గొడవకు సంబంధించి విచారణలో భాగంగా వీరిపై కేసులు నమోదు చేశారు. చట్ట వ్యతిరేక చర్యలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ డి.రమేష్ హెచ్చరించారు.

విద్యలో నైపుణ్యాలు అంతర్భాగం

- ఆ విధంగా సిలబస్ రూపకల్పన అవసరం
- ఆధునిక సాంకేతికత విద్యార్థులకు చేరువ చేయాలి
- బీవోఎస్ సమావేశంలో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: విద్యలో నైపుణ్యాలు అంతర్భాగం చేసే విధంగా సిలబస్ రూపకల్పన జరగాల్సిన అవసరం ఉందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం నిర్వహించిన వార్షిక బీవోఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధునిక టెక్నాలజీ ఆవిష్కరణలు, మార్పులను రాష్ట్ర యువతకు చేరువ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరుకుంటున్నారన్నారు. ఆ దిశగా పని చేస్తూ అన్ని కోర్సుల్లో ఐటీ సబ్జెక్టులను మిళితం చేయాలన్నారు. డేటా సైన్స్, మెషీన్ ఇంటెలిజెన్స్ వంటివి నేటి తరానికి అందించాలన్నారు. ప్రోగ్రెసివ్ థింకింగ్ కలిగి ఉండాలని ఇటీవల ముఖ్యమంత్రి ఉపకులపతులకు దిశానిర్దేశం చేసారని గుర్తు చేశారు.

అలాగే ఓపెన్ బుక్ సిస్టమ్‌ని ప్రవేశ పెట్టాలని సూచించారన్నారు. పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా విద్యార్థులు తమ సొంత ఆలోచనలతో సమస్యలకు పరిష్కారాలను అన్వేషించడం దీంతో సాధ్యపడుతుందన్నారు. ఇకపై ప్రతి సెమిస్టర్ ఆరంభంలో సిలబస్ మార్పులపై చర్చించేలా ఏడాదిలో రెండు పర్యాయాలు సమావేశం కావాలని సూచించారు. పేటెంట్ల సాధన, నూతన ఉత్పత్తుల తయారీతోపాటు మరింత ప్రగతిని సాధించే దిశగా యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖ నగరాన్ని ఎకనామిక్ జోన్‌గా తీర్చిదిద్దడంలో ఏయూ ముఖ్య భూమిక పోషించాల్సి ఉందన్నారు. విద్యార్థుల మానసిక ఒత్తిడి, సమస్యల నుంచి ఉపశమనం కలిగించే విధంగా వెల్‌నెస్ సెంటర్‌లు ఏర్పాటు కావాలని సూచించారు. ఇన్నోవేషన్‌లో ఏయూ జాతీయ స్థాయిలో 13వ స్థానంలో నిలిచిందన్నారు. రానున్న కాలంలో తొలి 10 స్థానాలలో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నూతన విద్య విధానం-2020లో సూచించిన విధంగా గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో పెంచుతూ సిలబస్‌ను తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, అకడమిక్ డీన్ ఆచార్య కిషోర్ బాబు, ప్రిన్సిపాళ్లు ఎ.నరసింహారావు, కె.శ్రీనివాసరావు, వై.రాజేంద్రప్రసాద్, జి.శశిభూషణరావు, వి.విజయలక్ష్మి, టి.శోభశ్రీ, కె.విశ్వేశ్వరరావు, ఎస్.కె.భట్టి పాల్గొన్నారు.

జమ్మిచెరువు పార్కులో అభివృద్ధి పనుల పరిశీలన



పార్కులోని వాకింగ్ ట్రాక్ పరిశీలిస్తున్న జెడ్సీ రాము తదితరులు

భీమునిపట్నం: భీమిలి నుంచి తగరపువలసకు వెళ్లే మార్గంలో ఉన్న జమ్మి చెరువు పార్కులో చేపట్టిన అభివృద్ధి పనులను జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము సోమవారం పరిశీలించారు. ఇక్కడ పనులు చేపట్టేందుకు రూ.84 లక్షలు కేటాయించగా తొలి విడతగా రూ.42 లక్షలతో వాకింగ్ ట్రాక్, చెరువు చుట్టూ రక్షణగా ఇనుప కంచె ఏర్పాటు చేయడంతోపాటు చిన్నపిల్లల క్రీడా సామగ్రి సమకూర్చారు. దాంతోపాటు అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టి రంగులు వేశారు. ఈ పనులన్నీ పూర్తి కావడంతో వాటిని జెడ్సీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కుకు అధిక సంఖ్యలో సందర్శకులు వస్తుండడంతో ప్రత్యేక శ్రద్ధతో ఇక్కడ అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. తొలివిడత పనులు పూర్తయ్యాయని, ఇక్కడ చేపట్టిన పనుల వల్ల రెండు నెలలుగా పార్కును మూసివేశామని, ఈ రోజు నుంచి తెరిచామన్నారు. రెండో విడతలో భాగంగా పార్కు లోపల లైటింగ్ సదుపాయం, రెయిన్ షెల్టర్లు, ఫొటో షూట్ చేసుకోవడానికి ప్రత్యేక ప్రదేశాలతోపాటు ఇతర సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించిన పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని తెలిపారు. ఆయనతోపాటు పార్కుల నిర్వహణ ఏఈ జి.సురేష్, పారిశుధ్య అధికారి ఎం.మహాలక్ష్మినాయుడు, సిబ్బంది ఉన్నారు.

పరికరాల కోసం 106 మంది పేర్ల నమోదు



దివ్యాంగుల వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

ఆనందపురం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన శిబిరంలో వివిధ పరికరాల కోసం 106 మంది దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా దివ్యాంగులకు, విభిన్న ప్రతిభావంతులకు వివిధ రకాల పరికరాలను అందించడానికి అర్హుల గుర్తింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమిలి నియోజకవర్గంలోని ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాలకు చెందిన 106 మంది దివ్యాంగులు అర్హత పత్రాలతో హాజరై తమకు కావాల్సిన పరికరాల కోసం పేర్లు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అడపా లవరాజు, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ జె.మాధవి, వైఎస్సార్ సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు కోరాడ అప్పలస్వామి నాయుడు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రంగుల పోటీలు



కృష్ణుని చిత్రపటానికి రంగులు వేస్తున్న చిన్నారులు

ఆనందపురం : మండలంలోని గంభీరంలో ఉన్న హరేకృష్ణ వైకుంఠ మందిరం నిర్మాణ ప్రదేశంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రంగుల పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ మేరకు కృష్ణుని చిత్రపటానికి రంగులు వేసే పోటీలను 1, 2 తరగతుల విద్యార్థులకు నిర్వహించారు. 26 పాఠశాలలు నుంచి 256 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలతో ప్రాంగణానికి చేరుకోవడంతో సందడి నెలకొంది. కార్యక్రమాన్ని హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రెసిడెంట్ భక్తదాస ప్రారంభించగా అంబరీస దాస, ఆదోషజ దాస, కేశవ కృపదాస పాల్గొన్నారు.

నైపుణ్యం పెంచుకుంటే అవకాశాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మురళీకృష్ణ

భీమునిపట్నం: ప్రస్తుత సాంకేతిక యుగంలో ఎలక్ట్రానిక్స్, ఇంటర్‌నెట్ అనుసంధానంతో అద్భుత ఫలితాలు వస్తున్నాయని ఇక్కడి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.మురళీకృష్ణ అన్నారు. కళాశాల వద్ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) ఆధ్వర్యంలో ఎంబెడెడ్ సిస్టం వింగ్ ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ అనే అంశంపై సోమవారం ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడు అన్ని ప్రాంతాల్లోనూ ఎలక్ట్రానిక్స్, ఇంటర్‌నెట్‌కు ఎంతో ప్రాధాన్యత ఉందని, దీనిపై పట్టు సాధించిన వారికి చక్కని అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఇక్కడ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ విభాగాల్లో చదువుతున్న విద్యార్థినులు ప్రత్యేక శ్రద్ధతో నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. ప్రాజెక్ట్ వర్క్‌లు చేయాలని సూచించారు. అధ్యాపకులు డాక్టర్ జి.పద్మావతి, డి.భుజంగరావు, ఆర్.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్‌నగర్‌లో గోపీచంద్ సందడి



హీరో గోపీచంద్‌పై చిత్రీకరిస్తున్న సన్నివేశం

కొమ్మాది: ప్రముఖ నటుడు గోపీచంద్ సాగర్‌నగర్‌లో సోమవారం సాయంత్రం సందడి చేశారు. కన్నడ దర్శకుడు నిమ్మహర్ష తెరకెక్కిస్తున్న భీమా అనే సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. ఇది గోపీచంద్‌కు 31వ చిత్రం కాగా, ఇందులో పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. ఇందులో రెడ్ సినిమా ఫేమ్ మాళవిక శర్మ హీరోయిన్‌గా నటిస్తున్నారు. యాక్షన్ ఎంటర్‌టైన్‌మెంట్‌గా తెరకెక్కిస్తున్న ఈ సినిమాను కేకే రాధామోహన్ నిర్మిస్తుండగా, రవి బూసురు సంగీతం అందిస్తున్నారు. మరో 10 రోజులపాటు బీచ్‌రోడ్డు పరిసరాల్లో సినిమా చిత్రీకరణ ఉంటుందని యూనిట్ సభ్యులు తెలిపారు.

కొత్తమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ



పండ్లు, గజమాలతో అలంకరించిన కొత్తమ్మతల్లి విగ్రహం

తగరపువలస: సంతపేట, కొత్తపేట గ్రామదేవత కొత్తమ్మతల్లిని వివిధ రకాల 75 కిలోల పండ్లు, గజమాలలతో సోమవారం సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించారు. ఈ అలంకరణకు దానిమ్మ, ఆపిల్, బత్తాయి, నారింజ, ద్రాక్ష, పైనాపిల్, అరటి, కివీ, లిచి, అత్తి, చెరకును ఉపయోగించారు. ఈ ప్రత్యేక అలంకరణలో అమ్మవారిని భక్తులు మంగళవారం దర్శించుకోనున్నారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో ఈ అలంకరణకు ఊడికల జగదీశ్వరరావు, లక్ష్మి దంపతులు సహకరించగా అమ్మవారిని చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు అలంకరించారు.